# నివురుగప్పిన నిప్పు

గది కవతల ఎవరిదో నడక చప్పుడు విన్న సరోజని పక్క మీద నుంచి త్వరగా లేచివెళ్ళి కుర్చీలో కూర్చుంది. ఎదురుగా టీపాయ్‌మీది పేపరుతీసి తెరిచి ఒళ్ళో పెట్టుకుంది. అంతలో శకుంతల గదిలోకి రానే వచ్చింది. తడిసిన చెక్కిళ్ళు తుడుచుకునే వ్యవధి లేకపోయింది సరోజనికి. శకుంతల వస్తూనే హాండుబాగ్ బల్లమీద విసురుతూ సరోజని దగ్గరగావచ్చి "ఏమిటీ ఏడుపు ముఖం చేతులారా చేసుకుని ఏడవడం కూడ ఎందుకు? సంతోషించక ప్రయోజకత్వానికి" అంది. స్నేహితురాలి పలకరింపుకు నవ్వకుండా వుండలేకపోయింది సరోజిని. నవ్వుతూ—"ఏమిటి యీ గాలివాన, ముందు కూర్చో, మాట్లాడదాం" అంది ప్రక్కనున్న కుర్చీ జరుపుతూ.

"హుఁ నవ్వుతున్నావ్, ఎట్లా వస్తోంది నవ్వు నీకు? నిన్న రాత్రంతా నేనెంత ఏడ్చానో, భయంతో ఎంత వణికిపోయానో - నువ్వు చూడబోతే నవ్వుతున్నావ్" అంది శకుంతల.

"బాగుంది, ఏడిస్తే ఎందుకేడుస్తావ్ అంటావ్, నవ్వితే నవ్వెట్లా వస్తుంది అంటావ్, అయితే ఏం చెయ్యమంటావ్ నన్ను."

"ఔనౌను, నేను చెయ్యమన్నట్లల్లా చేస్తావ్ మహాబుద్ధిమంతురాలివి. ఏమి చేస్తావో, ఎందుకింత సాహసానికి తలపెట్టావో నిన్నడుగుదామనే వచ్చాను" శకుంతల గొంతు బొంగురుపోయింది. సరోజని మాట్లాడలేదు. కళ్ళు నిండుకువచ్చాయి ఆమెకు. దిగ్గున లేచివెళ్ళి పక్క

మీద గోడవైపుకు తిరిగి పడుకుంది. శకుంతల లేచి గది తలుపు దగ్గరకు వేసి సరోజనిపక్కనే కూర్చుని "చెప్పు సరూ, చెప్పవ్. ఎందుకీ నిర్ణయానికి వచ్చావ్? చేతులారా జీవితాన్ని నరకం చేసుకుంటారా ఎవరైనా?" సరోజని పలకలేదు.

"ఏమిటీ మూగతనం, మాట్లాడమంటుంటే- చెప్పు సరూ, చెప్పమ్మా! నా దగ్గరెందుకు దాస్తావ్; చూడు రవి నాకు పెదనాన్న కొడుకే. వాడికన్నా దగ్గర అన్నయ్యలెవరూ లేరు నాకు. నీవంటి స్నేహితురాలు మా యింటి కోడలై వస్తుంటే ఇంకో పరిస్థితిలో అయితే, మీ యిద్దరికన్నా ఎక్కువగా నేను సంతోషించేదాన్ని. కాని సరూ, రవికి నువ్వంటే ఎంత ఎగతాళో నాకు తెలుసు. ఎప్పుడూ నిన్ను విమర్శిస్తూ ఎన్నో అనేవాడు నా దగ్గర. నవ్వుతూనే అన్నా, అతనికి నిజంగానే అనిపించి అన్న మాటలివి." "ఆరేళ్ళ అమ్మాయికి వుండే వ్యక్తిత్వంకూడ మీ ఫ్రెండుకు లేదని" "నాలుగో క్లాసు చదివి మానేసిన అమ్మాయిలు కూడ అంత బిడియపడరని," "ఎవరు చేసుకుంటారోకాని, అటువంటి భార్యకన్నా భారం ఇంకోటి వుండదని" "దేవుడా అమ్మాయికి అందమైతే యిచ్చాడు కాని ఆలోచన యివ్వలేదు. ఏ మాత్రం కాస్త మెదడంటూవున్నా ఇతర్ల మీద అంతగా డిపెండ్ కాదని"-ఇట్లాంటివి సవాలక్ష. ఏదీ దాచలేదే నీ దగ్గర, అన్ని చెప్పేదాన్ని నీకు. ఒక్కోసారి వాడితో పోట్లాడేదాన్ని, "నీకేం, ఆ అమ్మాయిని నువ్వు చేసుకుని బాధ పడి పోవద్దులే" అన్నాను ఒకరోజు. సరూ, రవి చెడ్డవాడని నేననడం లేదు. వాడెంత మంచివాడో నాకు తెలుసు. వచ్చిన చిక్కంతా వాడి యిష్టాలు, అభిరుచులు వేరు. ఏ కారణం చేతనైతేనేం, నువ్వంటే ఒక "చేతగాని" మనిషిగా అభిప్రాయమేర్పడింది వాడికి. అటువంటి భర్త నుంచి ఎలాంటి గౌరవం పొందగలవు నీవు? కలసి బ్రతకవలసిన మనిషి నిన్ను చులకనగా చూస్తే ఎట్లా సహిస్తావు? చెప్పు సరూ, చెప్పు. ఎందుకు నరకం చేసుకుంటావు బ్రతుకు." శకుంతల ఊపిరి పీల్చుకుంది. సరోజని చలనం లేకుండా కూర్చుంది.

"మాట్లాడవేం?"

"శకుంతలా, మీ అన్న నడగలేకపోయావ్, ఎందుకు ఒప్పు కున్నారని" అంది సరోజని. కాస్తంత కుతూహలం ఆమె కళ్ళలో మెరిసింది.

"ఔను, ఎంత ఆశ్చర్యమయిందో నాకు! పెదనాన్న వచ్చిచెప్పి, నీకిష్టమైతే చెప్పరా అనడిగారు వాణ్ణి. నేనక్కడే వున్నాను నిన్న. వాడు పకపక నవ్వి-"ఆ అమ్మాయిని చేసుకోడంకంటే, తంజావూరు బొమ్మ లుంటాయి చూడండి నాన్నా, కదిపితే తల ఆడించే బొమ్మలు- ఆ బొమ్మను చేసుకోవడం మేలు" అన్నాడు. పెదనాన్న ఏమీ మాట్లాడ లేదు. కాని కాస్తంత చిన్నబోయారు అనుకున్నాను ఆయన్నుచూసి. పెద్దమ్మ నిట్టూర్చి "వాళ్ళవాళ్ళ కసలు మనకిచ్చే వుద్దేశమేలేదట. రామ నాధంగారి అబ్బాయి ప్రకాశరావుకు యీ పిల్లను జేసుకోవాల నుందట. వాళ్ళకు ఆ అబ్బాయికే యివ్వాలని యిష్టం. పోతే ఆ అమ్మాయి ససే మిరా అతన్ని చేసుకోనందట. అడగ్గా అడగ్గా నిన్ను గురించి అడగమని ఆ అమ్మాయే చెప్పగా వాళ్ళ కబురంపారు" అంది కొడుకుతో. రవి ఆశ్చర్యంగా నావంక చూశాడు. నే నంతకంటే తెల్లబోయి-చూస్తుండి పోయాను. రవి తేరుకుని- "నిజమేనా అమ్మా" అన్నాడు. "బాగుంది వూరికే నే నెందుకు చెప్తాను, మీ నాన్ననడుగు పోనీ" అంది పెద్దమ్మ. రవి కళ్ళలో క్రొత్త మెరుపు కనిపించింది. వెంటనే "నాన్నతో చెప్పమ్మా నాకిష్టమేనని" అని గబగబ బైటకు వెళ్ళిపోయాడు. నేను పిలిచాను. కాని వినిపించుకోలేదు వాడు. నాగుండె బరువెక్కిపోయింది. అక్కడే నేలమీద చతికిలబడి పోయాను. పెద్దమ్మ వెళ్ళి చెప్పింది పెదనాన్నతో. పెదనాన్న అప్పుడే వుత్తరీయం భుజాన వేసుకుని ఆ మధ్యవర్తి ఇంటికి వెళ్ళారు. ఏదో చెప్పాలనిపించింది నాకు. గొంతులోమాట గొంతులోనే వుండిపోయింది. రాత్రంతా కన్నుమూస్తే ఒట్టు. ఎందుకిట్లా జరిగింది అని పలవరించిపోయాను. ఎంత తల పగలగొట్టుకున్నా, నీ అంత నీవు యీ నిర్ణయానికి ఎందుకు వచ్చావో నాకు తెలీలేదు. చెప్పు సరూ, చెప్పు ఎందుకిట్లా చేశావ్."

సరోజని మాట్లాడలేదు. ఏదో అర్థమైనట్లు ఆమె కళ్ళు నవ్వు కున్నాయి. కాని అది చదువుకునే స్థితిలో లేదు శకుంతల.

"ఆ ప్రకాశం నిన్నెంతగా ప్రేమించాడు! అది వట్టి ప్రేమకాదు సరూ, ఆరాధన! అంతగా ఆరాధించే మనిషిని వద్దని, చులకన చేసే మనిషిని ఎందుకు కోరుకున్నావ్ చెప్పు."

సరోజని వ్యంగ్యంగా నవ్వి "హుఁ! ఆరాధన, ఎందుకారాధించే వాడో కాస్త చెప్పు" అంది.

"ఎందుకేమిటి, అతనికి పూర్తిగా నచ్చావు నీవు. రవి నిన్ను ఎందు కెందుకు చులకన చేసేవాడో, ఆ కారణాలకే ప్రకాశం మెచ్చుకునే వాడు నిన్ను."

"అవు, శకుంతలా, సరిగ్గా అదేకారణం! నేను ప్రకాశాన్ని వద్దను కోడానికీ, మీ అన్నను కోరుకోడానికి, ఆఁ; అదే కారణం, అర్థమైందా" అంది సరోజని.

శకుంతలకు అర్థంకాక తెల్లబోయింది. "ఏమో! నాకేమీ తెలియ డంలేదు" అంది. సరోజిని నిట్టూర్చి "శకుంతలా, నిజంగా నేనేమిటో నీకు తెలియదు. నాలోని సంఘర్షణ నీకు తెలియదు. నేను ఎట్లా పెరిగానో తెలుసా నీకు? అమ్మా, నాన్న యిద్దరూ వాళ్ళ అభిరుచుల కనుగుణంగా పెంచారు నన్ను. నా అభిరుచులు తెలుసుకోవాలని, వాటికి విలువ నియ్యా లని వాళ్ళకెప్పుడూ తట్టలేదు. నాన్న సంపాదనలో, సంపదవల్ల లభించే సుఖాలకు నా కెప్పుడూతక్కువకాలేదు. కాని శకుంతలా, వ్యక్తిత్వ ప్రక టనకు స్వేచ్ఛలేకుండా పెరిగాను నేను! నాలాగా నేనువున్నానంటే, అది ఇంకేమి చెయ్యలేక వున్నాను. నా అభిరుచి నాలాగా వుండటంకాదు. ఎవరి మీద దేనిమీద ఆధారపడకుండా నా నిర్ణయాలు నేను చేసుకోవడం, పది మందితో కలసి హాయిగా బ్రతకగల్గడం నా కిష్టం. ఒకసారి పద్మ చెప్పింది గుర్తుందా? నా డిపెండెంట్ నేచరును మెచ్చుకుంటూ, ప్రకాశం "అంతగా ఆధారపడే భార్యను పొందడంకన్నా మగవాళ్ళకు వేరే ఆనం దం, గర్వం వుండవు" అన్నాడట. నాలో నేను దేన్నైతే అసహ్యించు

కుంటానో, దాన్ని అతడు ఆరాధిస్తున్నాడని తెలిస్తే, అతన్ని ఎట్లా ఆరాధించగలనంటావ్, చెప్పు. యీ వూబిలోంచి బైటపడ్డానికి ప్రయత్నిస్తున్నా నేను. ఇరవై ఏళ్ళ అలవాట్లు ఒక్కసారి పోవు. నా బలహీనతలను మెచ్చుకునే మనుష్యులమధ్య వున్నంతకాలం నా అసలు వ్యక్తిత్వానికి రూపు నివ్వలేను. ఆ ప్రయత్నానికి మొదలు అమ్మానాన్నల యిష్టానికి వ్యతిరేకంగా రవిని కోరుకున్నాను. ప్రకాశాన్ని వద్దన్నాను. రవికి నేనంటే చులకన అన్నావు. నిజం నాకు తెలుసు. అతనికి నేనంటే చులకన కాదు, నా బలహీనతలంటే చులకన, నన్ను వద్దన్నవాడల్లా, నా అంతట నేను కోరుకున్నాను అని వినేసరికి మనసు మార్చుకున్నాడు చూశావా! నన్ను "నేనుగా రూపు దిద్దుకోవాలంటే అతనిలాంటి వ్యక్తి సహచర్యమే కావాలి. అందుకే శకుంతలా, అందుకే మీ అన్నను కోరుకున్నాను." అంది సరోజని.

శకుంతల బరువుతీరిన మనస్సుతో "సరూ, ఇన్నాళ్ళ స్నేహం కూడ నిన్నర్థం చేసుకొనడానికి చాల్లేదు నాకు. మా రవికి, మా అన్నకు తగిన అమ్మాయి దొరికింది. నా స్నేహితురాలికి తగిన అబ్బాయి దొరికాడు. ఇంకానాకు కావలసిందేముంది? సరే అయితే మరి ఏడ్పావెందుకు సరో"

"భయంగా వుంది, శకుంతలా నన్నెట్లా అర్థంచేసుకుంటారో మీ అన్న"

శకుంతల తేలిగ్గా నవ్వి "అదంతా నాకు వదిలెయ్యి. మా అన్న నీయంత తెలివిగలవాడు కాకపోలేదులే, వాడికి ఏడ్చే అమ్మాయిలంటే గిట్టదు జాగ్రత్త. పద ఏదైనా సినిమాకెళ్దాం, మరి ఏడవకూడదు, నామీద ఒట్టే" అంది. సరోజిని కళ్ళు స్నేహపూర్వకంగా చెమ్మగిలినాయి.

—o—